21—7—82

# అభినవ అభిమన్యుడు

పాలప్రగడ సత్యనారాయణమూర్తి



**పాపం,** ఫణిభూషణరావు రాజకీయాల్లో ఇరుక్కుపోవడం చూస్తే, నా చిన్నప్పటి సంఘటన ఒకటి గుర్తుకొస్తుంది నాకు. అప్పటికి అయిదారేళ్ళు ఉంటాయేమో—సన్నగా గువ్వలా ఒలికిపి ముందు పెరట్లో పిల్లలం అంతా పరుగులు పెట్టి ఆడుకుంటున్నాము. అక్కడే తులసి కోటకి ఇసిరంగా కూర్చుని తల దువ్వుకుంటూన్న మా పెద్దమ్మ ఉన్నట్టుండి ఒక్క అరుపు అరిచింది— "ఒరేయ్! ఎగిరిపోతోంది పట్టుకోండిరా" అని. ఏవిటా అని చూస్తుండగా—తర్వాత ఎప్పుడో సవరం అల్లించుకోవడం కోసం ఆమె రోజూ దువ్వెన్న నుంచి వదిలంగా తీసి, ఉండజేసి, దాస్తూన్న తల వెంట్రుకల చిక్కు. పిల్లలం అంతా దాని వెనకాల పరిగెడితే, అది గాలికి అలా అలా ఎగిరెగిరి వెళ్ళి కాంపౌండ్ వాలుకి బదులుగా ఇంటి చుట్టూ పెంచిన గోరింటాకు చెట్లలో చిక్కుకుపోయింది. ఇహ చూడండి మా పాట్లు. ముళ్ళకంపలోంచి తల వెంట్రుకల చిక్కు లాగాలి. నా ఒళ్ళంతా గీరుకుపోయింది. ముళ్ళు గుచ్చుకుని మా అక్కయ్య చెయ్యి అంతా రక్తం. నా ఈడు వాడే మా పెద్దమ్మ

కొడుకు—ఆ గోరింటాకు కొమ్మల మధ్యన ఇరుక్కుపోయి ఒకటే ఏడుపు. ఆలగోల,పాలగోలాను. చివరి కానిక్కు ముళ్ళలోంచి వచ్చిందో లేదో జ్ఞాపకం లేదు కాని, మేము పడిన అవస్థా, ఒళ్ళంతా రక్తాలు కారి మేం ఏడ్చిన ఏడుపులూ మాత్రం ఇవాళ్టికి కూడా జ్ఞాపకం.

ఆ తంపెంద్రుకల చిక్కూ, ముళ్ళకంపా జ్ఞాపకం వస్తుంది, మా ఫణిభూషణరావు రాజకీయాల్లో ఇరుక్కుపోయి ఇవాళ నానా అవస్థా పడుతూ ఉండడం చూస్తే. అసలు ఎవరు ఇరుక్కోమన్నారు అని మీరు ఎవరైనా అడగచ్చు.

అదంతా అలా వచ్చింది.

వాళ్ళ నాన్నకి వాడు ఒక్కడే కొడుకు కావడం మొదటి ప్రమాదం అయితే, తాతలు సంపాదించిన ఆస్తి పాతిక ఎకరాలు ఉండడం రెండో ప్రమాదం అయింది. పోనీ ఏ ఏటేటా ప్రతి క్లాసూ తప్పకుండా పాస్ అయిపోయినా బాగుండిపోను. మా ఇద్దరి అక్షరాభ్యాసాలూ ఒకే రోజున జరిగినా, నేను ఎస్. ఎస్. ఎల్. సి. పాస్ అయ్యేనాటికి వాడింకా థర్డ్ ఫారం చదువుతున్నాడు. అదైనా సజావుగా సాగే




యోగం లేకపోయింది. ఏదో డేకుతూ, పాకుతూ హైస్కూలు మెట్లయినా దాటతా డనుకున్నాను. కాని ఈలోగా వాళ్ళ నాన్నే దాటిపోయాడీ లోకం నుంచి. ఇక దానితో ఫణిభూషణరావు పని పైలా పచ్చీసు అయింది. "గొప్పవాడు కాదలుచుకున్న ప్రతి వాడికీ చదువు ఒక ప్రతిబంధకం. కావలిస్తే బి. ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసయి రైల్వే గార్డు చేస్తున్న మా వాడిని చూడండి'' అంటూ నా ఉదాహరణ ఇచ్చాడందరికీ. పుస్తకాలన్నీ చుట్టబెట్టి గూట్లోకి విసిరి కొట్టాడు. ఇంక చూస్కోండి!

కావలసినంత ఖాళీ!
చెప్పలేనంత స్వేచ్ఛ!
చేతి నిండా డబ్బు!
పూరి నిండా సమస్యలు!

పిలవకుండానే చుట్టూ చేరి భజన కార్యక్రమం ప్రారంభించే ఉల్లాసజనం!

ఈ పరిస్థితుల్లో వాడు వెళ్ళి రాజకీయాల్లో పడ్డాడంటే ఆశ్చర్యం ఏముంది? ఎంత బుష్యశృంగుడైతే మాత్రం పడకేం చేస్తాడు, తల వెంట్రుకల చిక్కుని ఎగరేసుకుపోయి ముళ్ళ కంచెలో పడేసే ప్రభంజనంలా, వాతావరణం అంతా అంత అనుకూలంగా ఉంటే? సరే, నీళ్ళ కోసం బావిదగ్గ అవ్వాలు బిగించి పరస్పరం పుణ్యాక్కుంటున్న కొప్పుల మధ్య జోక్యం చేసుకుని రాజీ చెయ్యడంతో తన రాజకీయ జీవితం ప్రారంభించి, మా ఫణి, అలా అలా వీధి నాయకత్వంనుంచి పేట నాయకత్వంలోకీ, పేట నుంచి పల్లె, పల్లెనుంచి పట్టణ నాయకత్వాలలోకీ, బేక్టీరియా లాగ క్షణాలమీద ఎదిగిపోయాడు. ఆ తర్వాత ఎమ్. ఎల్.ఎ. పదవీ సుందరి తనంతట తానే వచ్చి స్వయంవరంలో మావాడి మెడలో దండ వేసి, అయిదేళ్ళపాటు హైదరాబాద్ లాక్కుపోయింది.

ఆ అయిదేళ్ళపాటూ ఓహ్! మా ఫణిభూషణరావు వెలుగు చూసి తీరాలి. ఆత్మీయుడిని కూడా కళ్ళతో తప్ప పలకరించలేని ఆ హడావిడీ, తెల్లని ఖద్దరు బట్టలమీదా, మెళ్ళో మల్లె పువ్వుల దండమీద ఫ్లాష్ బల్బుల వెలుగులు పడుతూ ఉంటే, రిమ్‌లెస్ కళ్ళజోడు వెనక నుంచి తళుక్కుమనే ఆ కళ్ళ కాంతి రివ్వు రివ్వుమని సెక్రటరేట్‌కీ, మంత్రుల ఇళ్ళకీ, అసెంబ్లీ హాల్‌కీ మధ్య షటిల్ సర్వీసులా పరిగెత్తే అతని ప్లిమత్ కారు తళతళలూ, ఆత్మ విశ్వాసానికీ, అన్ని రంగాల్లోనూ తాను సాధిస్తున్న విజయాలకీ ప్రతీకలా ఎల్లవేళలా పెదిమలమీద మెరిసే ఆ చిరునవ్వుల తటిల్లతలూ—ఏం చెప్పను? ఆ అయిదేళ్ళూ మహేంద్ర భోగం—మహారాజ యోగం—ఇంద్ర ధనుస్సులోని రంగుల సంగీతం అతని జీవితం.

అయిపోయింది!

ఎన్నిక లొచ్చాయి.

ఇన్నాళ్ళూ ప్రభుత్వాన్ని వెలిగించిన రాజకీయ పార్టీ అంటే ప్రజలకి మొహం మొత్తిందనీ, ఈ మారు వాళ్ళు ప్రతిపక్షాన్ని నెగ్గిస్తారనీ తన నియోజక వర్గంలో బాహాటంగా వినిపించసాగింది.

"ఆ...ఎన్ని ఎన్నికలు చూడలేదు? ఈ కబురు ఎన్నిమాట్లు వినలేదు? ఏం భయం లేదు. ప్రభుత్వం నెరపిన రాజకీయ పక్షానికి ఓటమి అనేది ఉండదు'' అంటూ కండువాలు సర్దుకుంటూ తన చుట్టూ తిరిగే స్వజనం భరోసా ఇస్తున్నారు.

అయినా ఆలోచించి అడుగు వెయ్యడమే మంచిది అనుకున్నాడు ఫణిభూషణరావు.

జ్యోతిష్కులచేత దేశ చక్రం వేయించాడు! పార్టీల జాతకాల్ని దైవజ్ఞులచేత సరి చూపించాడు. అంజనం వేయించాడు. అమ్మవారికి అయిదు ముంతల కల్లు పోయించి మరీ అడిగించాడు. లకోటా ప్రశ్నలు, చిలక ప్రశ్నలు—అన్నీ అయ్యాయి. చివరికి సమస్య సమస్యగానే ఉండిపోయింది—పరిష్కారం కాలేదు.

కొన్ని అటు అనుకూలంగా చెపితే, కొన్ని ఇటు అనుకూలంగా చెప్పాయి.

ఈ పార్టీలో ఉండడమా, ఆ పార్టీలో చేరడమా? రెండు పార్టీలూ ఇస్తాయి తనకి టిక్కెట్టు? ఏది గట్టి టిక్కెట్టు? ఏది గట్టెక్కించే టిక్కెట్టు?

ఇటా? అటా? ఎటు? ఎటు?

ఇలా సతమతమవుతూ ఆలోచనల్లో చిక్కుకున్న ఫణిభూషణరావుకి ఇంట్లో మరో చిక్కు ఎదురైంది.

"రాజకీయాలూ ఎన్నికలూ—ఎన్నికలూ రాజకీయాలూ—ప్రాణానికి హాయీ, స్తిమితం ఏం లేదు. చస్తున్నాం. మీరేమైనా సరే, ఈ సారి ఎన్నికల్లో నిల్చోడానికి వీల్లేదు. నిల్చుంటే నేను బావిలో దూకి చస్తాను—జాగ్రత్త!'' అంటూ అల్టిమేటమ్ ఇచ్చింది ధర్మపత్ని.

"నాన్నోయ్! నువ్వుమాత్రం మానెయ్యకు. ఏమైనా సరే ఈ ఎన్నికల్లో నిలబడాల్సిందే! ఈ అయిదేళ్ళూ నువ్వు ఉండి తర్వాత నా కా పదవి వదిలెయ్యి ఇప్పుడు నువ్వు నుంచోకపోతే వచ్చే ఎన్నికల్లో నాకు వారసత్వపు హక్కు పోతుంది. అమ్మ మాట విని మానేశావో నేను రైలు పట్టాల మీద తల పెట్టేస్తాను—జాగ్రత్త'' అంటూ పదిహేడేళ్ళు పూర్తిగా నిండని ఏకైక పుత్రుడు వార్నింగ్ ఇచ్చాడు.

ఇద్దరూ అన్నంత పని చేసే అఘాయిత్యపు మనుష్యులే! ఎవరి మాట వినడం, ఎవరిని పోగొట్టుకోవడం?

తల పట్టుకున్నాడు.

జుట్టు పీక్కున్నాడు.

'ఈ రాజకీయపు బ్రతుకు ఎందుకు ఎన్నుకున్నానురా దేవుడా అని ఏడ్చాడు. నిక్షేపంలా బి. ఎ. పాసయి, ఉద్యోగం చేసుకుంటూ, ఈ పాతికఎకరాలూ చూసుకుంటూ ఉండిపోతే తీరిపోను. రైల్వే గార్డు ఉద్యోగం చేస్తే ఏం గాక. మా వాడి జీవితమే హాయిగా స్తిమితంగా ఉంది— అనుకున్నాడు. అనుకోవడం ఏమిటి స్వయంగా నాతో అన్నాడు. ఒక రాత్రల్లా వచ్చి నా దగ్గర వాపోయాడు.

"అసలు ఎన్నికల్లో నుంచోవడమా, నుంచోక పోవడమా? రోజూ ఇంట్లో దీని మీద రామ రావణ యుద్ధం జరుగుతోంది. చివరికి నుంచున్నా నుంచోకపోయినా ఇంట్లో ఏదో ఒక ఘోరం జరగక తప్పేలా లేదు. ఎంత ఇరకాటంలో పడిపోయానురా దేవుడా అని రాత్రింబవళ్ళు ఒకటే ఏడుస్తున్నా. ఇది ఇలా ఉండగా, నిలబడ్డం అంటూ వస్తే ఏ పార్టీ తరఫున? ప్రజలు దేన్ని ముంచుతారో, దేన్ని తేల్చుతారో తేలటం లేదు. పోనీ ఏదో ఒక పార్టీ నాకు టిక్కెట్టు ఇవ్వం ల నమ్ము కదా! ఇద్దరూ ఇస్తాం

అనడం వల్లే, నా చిక్కు మరింత ఎక్కువైంది. ఏం చెయ్యమంటావు బ్రదర్'' అంటూ బిక్క మొహం వేసుకుని ఫణిభూషణరావు నన్నడిగేసరికి— నిజం చెప్పద్దూ, నాకు అతనంటే విపరీతమైన జాలివేసింది. ఎలాంటి వాడు ఎలా అయిపోయాడు!

సివంగిలా ఉండేవాడు.

చిన్నపిల్లాడిలా బెదురుచూపులు చూస్తున్నాడు.

ఆ నవ్వూ, ఆ ఠీవీ, ఆ కాంతీ ఏవీ ముఖంలో?

నిజంగానే చిక్కుల్లో పడిపోయాడు!

''ఇలా చెయ్యి'' అని ఏం చెప్ప గలను సలహా? తటపటాయించా. ఇంతలో మరో పిడుగులాంటి కబురు విని, ''సెరికిం జెప్పడు ...'' అన్నట్లు పై మీద కండువా వేసుకోవడం కూడా మరిచిపోయి ఆ మట్టున అలాగే వెళ్ళిపోయాడు.

ఆ వెళ్ళడం వెళ్ళడం తిరిగి మర్నాడు సాయంత్రం వచ్చాడు మా ఇంటికి.

నాకు అతణ్ణిచూస్తే కంగారు వేసి దడపుట్టింది.

పాతిక లంఘనాలు చేసినట్లు డీలా పడిపోయి నీరసంగా ఉన్నాడు. కళ్ళు గుంటలు పడ్డాయి. ముఖం అంతా పీక్కుపోయింది. మనిషిలో జీవ కళ లేదు.

''ఏమిటి ఇలా అయిపోయావు? ఏమైంది'' అంటూ రెండుమూడుసార్లు కుదిపి కుదిపి అడిగాక ''కూర్చో చెప్తాను'' అని నీరసంగా మూలిగి ఆ తర్వాత తాపీగా చెప్పాడు.

అంతా విన్నాక అప్పుడు నాకు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చిందన్నమాట మొదట చెప్పిన ''మా పెద్దమ్మ తల వెంట్రుకల చిక్కూ ముళ్ళ కంపానూ.''

ఆ మాటే అన్నాను అతనితో.

''కరెక్ట్... అసలీ రాజకీయాలు మొదటినుంచీ అలాగే ఉన్నాయి బ్రదర్— ఏ సమస్యనీ పరిష్కరించలేకుండా ఉన్నాను. ఒక చిక్కు విడదీయబోతే మరో చిక్కు తయారవుతోంది.

పేవ్‌మెంట్ల మీద దుకాణాలు తీయించమని ప్రజలూ ... కదిపితే కబడ్దార్ అని దుకాణాల వాళ్ళు.

ఈ కాంట్రాక్టు ఫలానా వాడికి ఇప్పించమని ఒక గ్రూపూ, వీల్లేదని మరో గ్రూపూ.

కిట్టింపు ధరలు కావాలో అని కొందరూ, ధరలు తగ్గించండోయ్ అని మరికొందరూ.

'ఫలానా ఆఫీసరు లంచగొండి. ట్రాన్స్‌ఫర్ చేయించండి' అని వాళ్ళూ 'అతడు నిఖార్సయిన వాడు. వాళ్ళ ఆటలు సాగక అంటున్నారు. ట్రాన్స్‌ఫర్ చెయ్యడానికి వీల్లేదని'' వీళ్ళు.

కార్మికుల్ని సమర్థిస్తే ఒక తంటా యజమానుల మాట వింటే మరో తంటా.

ఇదంతా ఇలా దారపు చిక్కు వ్యవహారంగా ఉంది. కనకే ఎందుకొచ్చిందని నేను ఏ పనీ చెయ్యకుండా ఈ అయిదేళ్ళూ నెట్టుకొచ్చాను, ఏదో ఒకటి చేస్తున్నట్లు నటిస్తూ. కాని ఈ సందర్భంలో ఇప్పుడలా పూరుకోవడానికి వీల్లేదు. రాజకీయాల్లో కొనసాగాలంటే, ఈ ఎన్నికల్లో నెగ్గాలంటే అటో ఇటో ఏదో ఒకటి చెయ్యాలి. అసలు బలికుండా లంటేనే ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. ఇప్పుడు కొత్తగా వచ్చిన సమస్య ఇన్నాళ్ళ లాగా తప్పించుకోడానికి వీల్లేందికాదు'' అంటూ ఫణిభూషణరావు క్రితం రోజు ''సెరికిం జెప్పడు ...'' అంటూ వెళ్ళి పోయిన కారణం, మళ్ళీ మళ్ళీ చెప్పి, ''శ్రీ ... ఏమంటావు? సలహా చెప్పు'' అంటూ అడిగాడు.

ఎవరుమాత్రం ఈ విషయంలో ఏం సలహా చెప్పగలరు?

కరవమంటే కప్పకి కోపం —

వదలమంటే పాముకి కోపం —

ఏమన్నా ఫణిభూషణరావుకి ఏదో ఒక వర్గం నుంచి నిష్కరమే కాదు, ప్రమాదం కూడా ఖాయం.

అవును మరి, ఈ వ్యవహారం అటువంటిది.

వూళ్ళో వో 'ల'కారం పైన సంపాదించిన వాళ్ళంతా కలిసి వాటాలు వేసుకుని ఫ్యాక్టరీ కట్టడం కోసం బంగారం లాంటి పది ఎకరాల బంజరు భూమిని గవర్నమెంటు దగ్గర్నుంచి ఫణిభూషణరావు సిఫార్సు వల్లే సంపాదించారు.

కాని ఇవాళ ఆ పది ఎకరాల్నీ వూర్లో ఒక వంద మంది అలగా జనం వచ్చి ఆక్రమించుకొని గుడిసె లేసేశారు.

ఆ జనం చేత స్థలాన్ని ఖాళీ చేయిస్తే, ఫణిభూషణరావుకి శాశ్వతంగా ఆ కులం వాళ్ళ మద్దతు పోయి, వోట్లు పోవడమే కాకుండా, బీదవాళ్ళ వ్యతిరేకి అనే పేరు కూడా వస్తుంది.

ఖాళీ చేయించకపోయాడో, తన ఎలెక్షన్ ఖర్చుకి ఇంతవరకూ ఆదుకుంటూ తనకి చేదోడు వాదోడుగా ఉంటున్న మోతుబరుల మద్దతు పోతుంది.

అటు జనబలం...

ఇటు ధన బలం...


ఏది లేకపోయినా తన బలం లేదు.

అంతేకాక వ్యతిరేకం చేశాడని తెలిస్తే అటు వాళ్ళైనా కక్ష కట్టవచ్చు, ఇటు వాళ్ళైనా పగ పట్ట వచ్చు.

ఏది ఎటయినా ప్రాణానికి మోసమే! పోనీ, అని ఏం చెయ్యకుండా వూరుకోడానికి వీల్లేదు. ఎటూ తేల్చి చెప్పడం కష్టం.

ఆ మాటే చెప్పాను. ''చూడు, ఫణీ... ఇది చాలా చిక్కయిన ప్రశ్న. ఎటయినా ప్రమాదమే. ఈ ఖాళీ స్థలం గొడవ ఒక్కటే కాదు. అటు పార్టీని ఎన్నుకోవడంలో కూడా నీకు గట్టి చిక్కే ఉంది. అలాగే ఎన్నికల్లో నుంచోవడం, నుంచోకపోవడం... ఈ చిక్కులన్నీ ఇప్పుడు నిన్ను ముప్పేటగా చుట్టుకున్నాయి... మా పెద్దమ్మ తల వెంట్రుకల తుట్ట వెళ్ళి ముళ్ళ చెట్లలో ఇరుక్కున్న పరిస్థితికంటే కూడా ఎక్కువ గందరగోళంగా ఉంది. అప్పుడు ఒళ్ళు గీరుకుపోయింది. వేళ్ళలో ముళ్ళు గుచ్చుకుని రక్తం కారింది. కాని ఇప్పుడు ప్రాణాలే పోతాయి. రక్తం కారినా చిక్కు విడింది అప్పుడు. కాని ఇప్పుడు నీ రాజకీయపు చిక్కు ప్రాణాలు పోయినా విడేలా లేదు... అందువల్ల నాకు ఇప్పుడు ఒక్కటే ఉపాయం తోస్తోంది... హాయిగా నువ్వు రాజకీయాల్లోంచి తప్పుకో. అందరికీ వినిపించేలా ప్రకటించు— 'నేను రాజకీయ సన్యాసం తీసుకుంటున్నాను ఒహోయ్' అని. తిట్టేవాళ్ళు తిట్టినా, నవ్వుకొనేవాళ్ళు నవ్వుకున్నా నీకీ చిక్కు సమస్య పోతుంది. ప్రమాదం తప్పుతుంది. లేదా ఇంట్లో ఒక మరణమో, ఎన్నికల్లో ఓటమో, జన ధన ప్రహరణాల్లో ఏదో ఒకటో తప్పదు. ఆలోచించుకో'' అన్నాను.

ఫణిభూషణరావు నా కేసి బేలగా చూశాడు. ''అయితే తప్పదా? రాజకీయాలు వదిలేయాలంటావా? ఈ రాజకీయాల స్టేషన్ వదలడానికి ఇప్పుడు పచ్చజెండా వూపుతున్నావు. ఇదే ముప్పై ఏళ్ళ క్రితం ఈ స్టేషన్‌లోకి రాకూడదని ఎర్ర జెండా చూపించక పోయావా? రాజకీయాల జోలికి రాకుండా ఉండేవాడిని. ఇన్నేళ్ళనుంచి రాజకీయాల మత్తుకి అలవాటుపడిపోయిన వాడిని—ఇప్పుడీ మత్తు వదలమంటే ఎలా? వదలలేను, బ్రదర్. సరే, కానియ్యి. ఏది ఎలా అయితే అలా అవుతుంది. ముళ్ళ కంపల్లో ఇరుక్కున్నాక బయటికి పోవాలంటే కుదురుతుందా?




ముళ్ళూ గుచ్చుకుంటాయి.

అదృష్టం ఉంటే గోరింటలూ విచ్చుకుంటాయి.

అటయితే గాయాలూ రక్తం —

ఇటయితే గోరింటలూ — పంట. ఎటయినా ఎరుపే. తెలుపు లేదు. బ్రతుకులో మెరుపు లేదు. వస్తా, బ్రదర్. వస్తా''అంటూ రాజకీయాల మత్తు వదలలేక, పరిష్కారం కాని సమస్యల్ని పరిష్కరించడం కోసం పద్మ వ్యూహం లాంటి తల వెంట్రుకల చిక్కుల్లోకి మళ్ళీ తల దూర్చే ఉద్దేశంతో భారంగా అడుగు కదిపాడు ఫణిభూషణరావు.

నాకు జాలేసింది, ఆ అభినవ అభిమన్యుడి అవస్థ చూసేసరికి. రాజకీయాలు అతణ్ణి తేల్చవు. నాకు తెలుసు. చిక్కులన్నీ కాళ్ళకు అడ్డం పడి అతణ్ణి ముంచేస్తాయి. ఆ సంగతి అతనికీ తెలుసు.

కాని వెళ్ళకుండా ఆగగలడా? పోనీ అని మనం అతణ్ణి ఆపగలమా?

ఊహూఁ! ... అది ఒక మత్తు — రాజకీయాల గమ్మత్తు! ... ప్చ్ ... అ ది అంతే. ★